క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెక్కొండ : తెలంగాణ గురుకుల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల (బాలికల) ప్రిన్సిపాల్ జి. శ్రీదేవి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ ఒక్కో గ్రూపుల్లో 35 సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహిస్తారన్నారు. మే 10న నిర్వహించనున్న పరీక్షకు మార్చి 2025లో పదో తరగతి పరీక్షలకు హాజరై, ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె వివరించారు. ప్రవేశపరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్ల ద్వారా విద్యార్థుల ఎంపిక ఉంటుందని ఆమె చెప్పారు.

సంకీర్తనలకు తరలిన భజనబృందం

ఖానాపురం: మండలంలోని బుధరావుపేటకు చెందిన భజన బృందం సభ్యులు బుధవారం తిరుపతికి తరలివెళ్లారు. అఖండహరినామ సంకీర్తనల కోసం కర్ర పిచ్చిరెడ్డి బృందం సభ్యులు గ్రామంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుపతిలో భజనలు చేయడానికి వెళ్లారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటనర్సయ్య, చెడిపాక ఉపేందర్, నర్సయ్య, ప్రమీల, విజయలక్ష్మి, సుగుణ, మల్లయ్య, రామయ్య, మంజుల పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

గీసుకొండ : మండలంలోని ధర్మారం, గీసుకొండలో మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిల ఏకైక కూతురు సుస్మితాపటేల్ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పేదలకు అన్నదానం చేశారు. కేక్ కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ధర్మారంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గోపాల నవీన్‌రాజు, రిటైర్డ్ హెచ్‌ఎం కొమ్ముల బాబు, నాయకులు కిషోర్, రవి, కుమారస్వామి, శ్రీకాంత్, బాబూరావు, బాలరాజు భిక్షపతి, గీసుకొండలో జిల్లా నాయకుడు అల్లం బాలకిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నాయకులు వీరగోని రాజ్‌కుమార్, మర్రెడ్డి, భరత్, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు. నాయకుడు దోలె చిన్ని ఆ ధ్వర్యంలో కొనాయమాకులలో రంజాన్ సందర్భంగా ముస్లింలకు పండుగ సరుకులను పంపిణీ చేశారు.

నిలిచిపోయిన అంగడి వేలం

నెక్కొండ: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడి (వారాంతపు సంత) వేలం పాటలో అప్‌సెట్ ప్రైజ్ రానందున పాటలు నిలిచిపోయాయని ఈఓ సదానందం తెలిపారు. మేకల–గొర్రెలు, తైబజారు (గంప చీటి)లకు 2025–26 సంవత్సరానికి గాను బుధవారం జీపీ కార్యాయలంలో ఎంపీఓ దయాకర్ సమక్షంలో మూడోసారి వేలం పాటలు జరిగాయి. కాగా మేకల–గొర్రెలకు రూ.15.10 లక్షలకు, తైబజారుకు రూ.1.81 లక్షలకు మాత్రమే గుత్తేదారులు పాటలు పాడారు. దీంతో ప్రభుత్వం నిర్ణయించిన (అప్‌సెట్ ప్రైజ్) ధర కంటే తక్కువకు వేలం పాటలు గుత్తేదారులు పాడడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు వాయిదా (దుబార) వేసినట్లు ఆయన చెప్పారు. అధికారుల సూచనల మేరకు తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ వేలంలో గుత్తేదారులు, కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

దుగ్గొండి : అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి చెందిన సంఘటన మండలంలోని రేకంపల్లిలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మంద లక్ష్మి(70) 2013 నుంచి 2019 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. వివాదరహితురాలిగా పేరు తెచ్చుకున్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. మృతదేహాన్ని నర్సంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, ముదిరాజ్ మహాసభ ఎన్నారై విభాగం రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల నాయకులు శ్రీనివాసరెడ్డి, కుమారస్వామి, మాజీ సర్పంచ్‌లు సందర్శించి నివాళులర్పించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు చెల్లించాలి



నర్సంపేట : గ్రామాల్లో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వెంటనే వేతనాల చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం చెన్నారావుపేట మండల అధ్యక్షుడు గుగులోతు రమేశ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నల్ల శ్రీవాణికి బుధవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా వేతనాలు అందించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నా రు. అంతేకాక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల ఉపాధ్యక్షురాలు శ్రీ దేవి, సలహాదారులు జంపాల రాజయ్య, మర్రి సు రేష్, ఇస్లావత్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల రక్షణకు గ్రీన్ నెట్ షెడ్‌లు

- వేసవిలో ఎండిపోకుండా చర్యలు
- అన్ని గ్రామపంచాయతీల్లో ఏర్పాటు
- నిత్యం పర్యవేక్షిస్తున్న అధికారులు

ఖానాపురం: తెలంగాణ ప్రభుత్వం వన మహోత్సవంలో భాగంగా ప్రతీ సంవత్సరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతుంది. మొక్కలు నాటడానికి ప్రతీ గ్రామపంచాయతీల పరిధిలో మొక్కల పెంపకాన్ని నిర్వహిస్తుంది. ప్రతి ఏడాది మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతూ వాటిని సంరక్షిస్తుంది. అంతరించి పోయిన అడవుల శాతాన్ని పెంచడానికి వనమహోత్సవం కార్యక్రమం కొనసాగుతోంది. ప్రస్తుతం గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఖానాపురం మండల వ్యాప్తంగా 20 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రతీ జీపీ పరిధిలో నర్సరీలను ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో నూతనంగా లక్షా 36 వేల మొక్కల పెంపకాన్ని చేపట్టారు. వీటితో పాటు గతంలో మిగిలిన 76 వేల మొక్కలను సైతం కాపాడుతున్నారు. ఇందులో ప్రధానంగా దానిమ్మ, జామ, నిమ్మ, సీతాఫల్‌తో పాటు పూలను ఇచ్చే చెట్లు, అటవీ జాతికి చెందిన మొక్కలను పెంచుతున్నారు. వీటిని జూన్ నెల వరకు కాపాడాల్సి ఉంటుంది. వేసవి కాలం కావడంతో ఎండవేడిమి నుంచి మొక్కలను రక్షించడానికి ప్రభుత్వం, అధికారులు రక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు. ప్రతీ నర్సరీకి గ్రీన్ నెట్ షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని తడుపుతూ మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అలాగే ఉదయం, సాయంత్రం వేళల్లో నర్సరీలో ఏర్పాటు చేసిన వన సేవకుడితో మొక్కలకు నీటిని అందిస్తున్నారు. దీంతో ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పొందుతున్నారు. నర్సరీల్లో పెంచిన మొక్కలను జూన్, జూలై నెలల్లో నాటేందుకు రక్షిస్తున్నారు.



నర్సరీకి ఏర్పాటు చేసిన గ్రీన్ నెట్ షెడ్



నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

షెడ్లు ఏర్పాటు చేశాం



ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలే పెంచుతున్నాం. అవి ఎండిపోకుండా ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రీన్‌నెట్ షెడ్‌లు ఏర్పాటు చేశాం. మొక్కలు నాటే కార్యక్రమం నాటికి పెంచి అందుబాటులోకి తీసుకువస్తాం. లక్ష్యాలకు అనుగుణంగా మొక్కల పెంపకాన్ని చేపడతాం.

– అంబటి సునీల్‌కుమార్, ఎంపీడీఓ

ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలి

- డీఎంహెచ్‌ఓ సాంబశివరావు



రికార్డులను పరిశీలిస్తున్న సాంబశివరావు



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్

వర్ధన్నపేట: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు అన్నారు. వర్ధన్నపేట–1 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను బుధవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్స అందించాలన్నారు. ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని కోరారు. సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, గడువు దాటిన మందులను డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. పల్లె దవాఖాన డాక్టర్ మౌనిక, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ఎల్‌డీ కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజు, స్వర్ణకుమారి, మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

దుగ్గొండి : మండలంలోని మందపల్లిలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాష్ బుధవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం చిన్నారులకు, గర్భిణీలకు టీకాలు ఇచ్చే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల నిర్వహణ సజావుగా జరగాలని, ఎండలు బాగా ఉన్నందున ప్రజలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించి వాటిని వాడే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు వనమాల, హెల్త్ ఎడ్యుకేటర్ విద్యాసాగర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్త రజిత, పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- కేంద్ర ఖాదీ చిన్నపరిశ్రమల మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం

వర్ధన్నపేట: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని కేంద్ర ఖాదీ చిన్నపరిశ్రమల మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. బుధవారం పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో చైతన్య కళాసంస్థ ప్రతినిధి లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లేశం చేతుల మీదుగా బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవచర్యల కారణంగా పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్క పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై ఇంలాటి కార్యక్రమాలు చేపట్టి విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి పరిరక్షణకు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఉద్యమ స్ఫూర్తితో సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయసాగర్, మునిసిపల్ కమిషనర్ సుధీర్‌కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య, ఎస్సై భూక్యా చందర్, నాయకులు సిలువేరు కుమారస్వామి, ఎస్‌బీఐ మేనేజర్ సునీల్‌కుమార్, ఆల్ఫోర్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సింహాద్రి, చైతన్య కళాసంస్థ సభ్యుడు వల్లందాసు లక్ష్మణ్, సంపత్‌రావు, సంపత్, ప్రభాకర్, ప్రవీణ్, విక్రమ్, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న మల్లేశం

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం



పర్వతగిరి: మండలంలోని వడ్లకొండలో రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణం కోసం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు రూ.1,00,116 అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు బుధవారం శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో దేవాలయం నిర్మాణ కమిటీ సభ్యులు, వడ్లకొండ మాజీ సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్, మాజీ ఎంపీటీసీ అత్తి రేవతికుమార్‌ల ఆధ్వర్యంలో సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు బోయినపల్లి స్వామిరావు, కరిమిళ్ల దేవేందర్‌రావు, చందసాని సమ్మయ్య, జుట్టుకొండ రమేష్, రాజు, సంపత్‌రావు, రంగయ్య, మాజీ ఎంపీపీ కరిమిళ్ల దుర్గారావు, లింగయ్య, బైరి ఎల్లయ్య, పాల్గొన్నారు.

గీసుకొండ : గ్రేటర్ వరంగల్‌లోని 17వ డివిజన్ ఆదర్శనగర్‌లో హనుమాన్ దేవాలయ పునర్‌నిర్మాణానికి బుధవారం బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబు రూ. 5,116 సాయం అందించారు. ఆలయ అభివృద్ధి కోసం తోడ్పాటును అందిస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆలయ కమిటి సభ్యులు, 16,17 డివిజన్ల పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలి

నర్సంపేట రూరల్ : ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి పర్యావరణాన్ని రక్షించాలని మండలంలోని ముగ్ధుంపురం గ్రామ కార్యదర్శి రహీంపాషా, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సందీప్ అన్నారు. ముగ్దుంపురంలోని జయముఖి ఇంజనీరింగ్ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎకో ఫ్రెండ్లీ పేపర్ బ్యాగ్‌లను గ్రామంలోని ప్రతి ఇంటికి అందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

దుగ్గొండి: మండలంలోని గిర్నిబావి సెంటర్‌లో ఆటోస్టాండ్ వద్ద ప్రయాణికులు, ఆటోడ్రైవర్ల కోసం పొనకల్ గ్రామానికి చెందిన బండి శ్రీనివాస్ తల్లి బండి కమల జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు, ఆటో డ్రైవర్‌ల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పరామర్శ

పర్వతగిరి : హసన్‌పర్తి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ తల్లి బండి సారమ్మ బుధవారం మృతి చెందింది. ఈ సందర్భంగా ఏనుమాముల మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ఏడుదొడ్ల జితేందర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్లు బోయిన్‌పల్లి యుగేంధర్‌రావు, గనిపాక విజయ్‌కుమార్‌లు బైరాన్‌పల్లిలోని వారి నివాసానికి వెళ్లి పార్థివదేహంపై పూలమాల వేసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. వారి వెంట మాజీ రైతుబంధు మండల కో ఆర్డినేటర్ చిన్నపాక శ్రీనివాస్, ఉన్నారు.

కేజీబీవీని సందర్శించిన అధికారులు

నర్సంపేట: చెన్నారావుపేటలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంను కలెక్టర్ ఆదేశాల మేరకు మండల అధికారుల బృందం బుధవారం ఆకస్మికంగా సందర్శించింది. ఈ సందర్శనలో పాఠశాలలోని కిచెన్ షెడ్, స్టోర్ రూమ్, మౌలిక సదుపాయాలు, టాయిలెట్స్, తాగునీరు, తరగతి గదులు, డార్మెంటరీ వసతులను పరిశీలించారు. అలాగే కోడిగుడ్లు, వంటనూనె, వండిన ఆహారాన్ని పరిశీలించారు. ప్రతి రోజు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ సూచించారు. పాఠశాల స్థితిగతులపై అధికారులు విద్యార్థులతో చర్చించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని మండల అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ నల్ల శ్రీవాణి, ఎంఈఓ సరళ, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మెట్టుపల్లి జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కేజీబీవీని సందర్శించిన మండల అధికారులు

సంక్షిప్త సమాచారం

ప్రవీణ్‌కుమార్ మృతి క్రైస్తవులకు తీరని లోటు

నర్సంపేట : రాజమండ్రి ప్రాంతంలో అనుమానాస్పదంగా పగడాల ప్రవీణ్‌కుమార్ మృతి చెందడం రెండు తెలుగు రాష్ట్రాల క్రైస్తవులకు తీరని లోటని బిషప్ ఎం.ఆదామ్ బెన్ని అన్నారు. పట్టణంలో డివిజన్ పాస్టర్ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ అధ్యక్షుడు పాస్టర్ లాజరు అధ్యక్షతన సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదామ్‌బెన్ని మాట్లాడుతూ ప్రవీణ్‌కుమార్ మృతి యావత్తు క్రైస్తవ లోకానికి అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. అతని మృతిని సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సామాజిక బాధ్యతతో పని చేయాలి

గీసుకొండ : కుల సంఘాలు సామాజిక బాధ్యతతో పనిచేస్తూ లింగ వివక్ష, హింసను రూపుమాపడానికి కృషి చేయాలని బాలవికాస సంస్థ ట్రెనింగ్ కోఆర్డినేటర్ ఇందిర అన్నారు. బుధవారం మండల కేంద్రంలో లింగ ఆధారిత హింస నివారణ, సమస్య పరిష్కారంపై కుల సంఘాల పెద్దలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో కుటుంబ హింసను, సహకరించే వ్యవస్థలపై ప్రజలను చైతన్యవంతులను చేసి వాటిని రూపుమాపేందుకు కృషి చేయాలని కోరారు.

నవోదయ సీట్లు సాధించిన విద్యార్థులు



నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ టెక్నో స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు నవోదయ సీట్లు సాధించడం హర్షనీయమని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం నవోదయలో సీట్లు సాధించిన నిఖిత, వర్షిత్, సంజిత్, రేవంత్, దీక్షిత్‌లను ఆయన అభినందించారు.

చెన్నారావుపేటలో

నర్సంపేట : చెన్నారావుపేటలోని సిద్దార్థ గురుకుల హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని ముత్యం శ్రీకృతి నవోదయలో సీటు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న శ్రీకృతి నవోదయ ఎంట్రన్స్ ఫలితాల్లో అర్హత సాధించి సీటు సాధించడం జరిగిందన్నారు.

పార్టీల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లిలో ఎస్‌ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి, ముస్లిం సోదరులు అశ్రఫ్‌పాషా, మోహినోద్దీన్, ఎండీ అన్వర్, సైదులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కొండూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

రాజీవ్ యువవికాసం స్కీం గడువు పెంచాలి

రాయపర్తి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం గడువును పెంచాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు గుగులోతు అరుణ్‌నాయక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ కార్యాలయంలో కులం, ఆదాయం సర్టిఫికెట్‌లను ఇవ్వడంలో వేగవంతం చేయాలని కోరారు.

విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

రాయపర్తి: విద్యార్థులు అన్ని రంగాల్లో అవగాహన కలిగి ఉండాలని ప్రతీ విషయాన్ని గ్రహించి చదువులో ముందుకు సాగాలని ప్రిన్సిపాల్ ఎస్.సరిత పేర్కొన్నారు. బుధవారం స్థానిక తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు పీఎంశ్రీ పథకంలో భాగంగా ఎస్‌బీఐ ఫైనాన్షియల్ లిటరసీలో భాగంగా ఐత కమలాకర్‌తో బ్యాంకింగ్‌కి సంబంధించిన వివరాలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అవయవదానంపై ప్రచారం



గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతరలో బుధవారం అవయవదానంపై కరపత్ర ప్రచారాన్ని చేపట్టారు. తెలంగాణ నేత్ర, శరీర, అవయవ దాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆధ్వర్యంలో భక్తులకు అవయవ దానంపై అవగాహన కల్పించే విధంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, వంశపారంపర్య ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, వైద్యులు పాల్గొన్నారు.

గుట్టుగా తుమ్మ చెట్ల నరికివేత

- గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వని వైనం
- ఐబీ అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

సంగెం: కంచె చేను మేసిందన్న చందంగా ఉంది మండలంలోని కాట్రపల్లి పరిస్థితి. వాల్టా చట్టాన్ని కాపాడాల్సిన అధికారులే యథేచ్ఛగా చట్టాన్ని ఉల్లంఘించి గ్రామ, మండల అధికారులకు, గ్రామస్తులకు తెలియకుండా గుట్టుగా చెరువు కట్టకు తుమ్మ చెట్లను పక్క మండలానికి చెందిన వ్యక్తికి విక్రయించి ఆ మండలానికే చెందిన కూలీలు వచ్చి చెట్లను నరికివేస్తుంటే ఐబీ అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కాట్రపల్లి ఊర చెరువు కట్టకు సుమారు 20 ఏళ్లకు పైబడిన తుమ్మ, వేప, నమలినార తదితర భారీ వృక్షాలు ఉన్నాయి. వీటిపై కన్నేసిన ఐబీ అధికారులు గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు , గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మికి, గ్రామస్తులకు గానీ సమాచారం ఇవ్వకుండ గీసుకొండ మండలానికి చెందిన ఓ కర్ర వ్యాపారికి గుట్టుగా విక్రయించారు. అదే మండలానికి చెందిన నలుగురు కూలీలు కాట్రపల్లి ఊరచెరువు కట్టకు వచ్చి ఐబీ లస్కర్ సమక్షంలో భారీ చెట్లను మిషన్లతో కోసివేస్తుండడాన్ని గ్రామస్తులు చూసి ఇలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. మాములుగా ఐతే రైతులు తమ గట్లవెంట, ఖాళీ ప్రదేశంలో పెంచిన చెట్లను నరికివేయాలంటే మీసేవ ద్వారా చలానా కట్టి సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తే వారు పరిశీలించి అనుమతి ఇస్తారు. కానీ ఈ విషయం సదరు అధికారులకు తెలియక, మేమే అధికారులం మమ్ముల్ని ఎవరు అడుగుతారనే దీమాతో మొత్తంగా పదుల సంఖ్యలో భారీ వృక్షాలు నరికి వేయించారు. ప్రభుత్వం భూములు, చెరువులు, కట్టలకు కున్న చెట్లను నిబంధనల ప్రకారం గ్రామంలో చాటింపు వేయించి వేలం వేసిన తర్వాతనే నరికి వేయించాల్సి ఉంటుందన్నారు. హరితహారం సమయంలో చిన్న చిన్న మొక్కలు పెట్టి ఫోటోలు దిగే అధికారులు నిబంధనలకు విరుద్ధంగా భారీ వృక్షాలను అక్రమంగా అమ్ముకున్నారని దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదన్నారు. దీనిపై ఐబీ ఏఈ హమీద్‌ను వివరణ కోరడానికి ‘సాక్షి’ ఫోన్‌లో సంప్రదించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.



కాట్రపల్లి ఊరచెరువు కట్టకు నరికి వేసిన తుమ్మ చెట్లు

ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలి

గీసుకొండ : దేశంలో మత, నియంతృత్వ శక్తులను నిలువరించి ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ జైబాపు, జై భీం, జై సంవిధాన్(రాజ్యాంగం) అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టిందని కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆరెపల్లిలో ఏర్పాటు చేసిన మండల స్థాయి గ్రామ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. బాపూజీ చూపిన మార్గం, అంబేద్కర్ బోధనలు, రాజ్యాంగ పరిరక్షణ తదితర విషయాలను కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించి గ్రామ గ్రామాన ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, మండల మహిళా అధ్యక్షురాలు సరిత, మండల నాయకులు కొమ్ము శ్రీకాంత్, రాజు, స్వామి, రమేశ్, మాజీ ఎంపీటీసీ గోపాల్, పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం


సంగెం : రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజలందరికి కలిగించి రాజ్యాంగాన్ని కాపాడుకుందామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కాట్రపల్లిలో జై బాపు, జై బీమ్, జై సంవిధాన్‌పై నిర్వహించే పాదయాత్రపై మండల రూట్ మ్యాప్‌ను తయారు చేశారు. జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు రమేష్, కేశవులు, మార్కెట్ డైరెక్టర్లు నాగరాజు, నర్సింహనాయక్, సంధ్య, వీరమ్మ, వెంకటేశ్వర్లు, కిశోర్, పాల్గొన్నారు.



గీసుకొండ : మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్

స్కాలర్‌షిప్‌లు రాకపోతే పరీక్షలు బహిష్కరిస్తాం

నర్సంపేట : ప్రైవేట్ కళాశాలలకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు మార్చి లోపు రాకపోతే రాబోయే సెమిస్టర్ 2, 4, 6 పరీక్షలు బహిష్కరిస్తామని ప్రైవేట్ కళాశాలల యాజమానులు అన్నారు. పట్టణంలోని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు బుధవారం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత కళాశాలలు కేవలం ప్రభుత్వం ఇచ్చే ఉపకార వేతనాలపై ఆధారపడి నడుస్తున్నాయని, స్కాలర్‌షిప్‌లు ఇవ్వకపోవడంతో నిరుద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. 2023 ఆగస్టు, సెప్టెంబర్ నెలలో గత ప్రభుత్వం విడుదల చేసిన స్కాలర్‌షిప్‌ల మంజూరు టోకెన్లు వచ్చి ప్రభుత్వం దగ్గర దాదాపు రూ.600 కోట్లపై చిలుకు పెండింగ్‌లో ఉ న్నాయని, నేటికి వాటికి మోక్షం లేదన్నారు. ప్రైవేట్ కళాశాలల యజ మానులు జీజుల సాగర్, నాగరాజు, రవి, సర్వేశం, ప్రభాకర్‌రెడ్డి, మల్లేషం, రాంరాజ్, రాజ్‌కుమార్, రవీందర్, తిరుపతి పాల్గొన్నారు.



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



నర్సంపేట : పట్టణంలోని వరంగల్ రోడ్డులో 813 సర్వే నంబర్‌లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఎంఎస్పీ, డీబీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో పాత తహసీల్దార్ కార్యాలయంలో మునిగె యాకూబ్ అధ్యక్షతన రిలే నిరాహార దీక్ష చేపట్టారు. డీపీడీపీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేష్, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌దీప్ మాట్లాడుతూ గుడిసెలకు పట్టాలిచ్చి విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సంగెం: స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు చెల్లించిన వడ్డీని తిరిగి ఇచ్చినందుకు కృతజ్ఞతగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవీందర్ మాట్లాడుతూ మండలంలో 1026 స్వయం సహాయక సంఘాలకు రూ.2, 41,08,062లు వాపస్ వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో శాంతి మండల సమాఖ్య కార్యదర్శి రాజమణి, మహిళా నాయకులు బిక్కిరెడ్డి సంధ్య, గుగులోత్ వీరమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, నాగరాజు, నర్సింహనాయక్, రాజు పాల్గొన్నారు.